

ఇద్దరు బిఎల్ఒలు సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

తుది ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లడంతో ఇద్దరు బిఎల్ఒలను విధుల నుంచి సస్పెండ్ చేశారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లిగూడెం వార్డు సచివాలయం-20లో విలేజ్ రెవెన్యూ అధికారి గ్రేటు-2 బిఎల్ఒగా విధులు నిర్వహిస్తున్న జి.నిర్మల, పెద్దతాడేపల్లి సచివాలయం-2లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ బిఎల్ఒగా విధులు నిర్వహిస్తున్న వి.అనూషను సస్పెండ్ చేశారు. ఇటీవల ప్రకటించిన ఓటర్ల తుది జాబితాలో వచ్చిన తప్పులకు బాధ్యులను చేస్తూ విధుల నుండి సస్పెండ్ చేస్తూ పూర్తి విచారణకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు.

పెద్దలకు అండ.. పేదలపై నిర్బంధకాండ..!

'దోసపాడులోని దళితుల భూసమస్యపై అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారా.. ఏళ్ల తరబడి సమస్యను తేల్చకుండా పేదలకు అన్యాయం చేస్తున్నారా.. పేదలకు చెందాల్సిన భూములను బడాబాబులు అక్రమంగా అనుభవిస్తున్నా అధికారులకు పట్టడం లేదా' అంటే అవుననే సమాధానం వస్తోంది. పేదల భూసమస్యను ఏళ్ల తరబడి పరిష్కరించకుండా పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై బాధితుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. వెంటనే సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని బాధిత పేదలు కోరుతున్నారు.



బాధితులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు (ఫైల్‌ఫోటో)

- దోసపాడులో దళితుల భూసమస్యపై అధికారుల నిర్లక్ష్యం
- జెసి కోర్టులో దీర్ఘకాలంగా అసైన్డ్ భూముల సమస్య పెండింగ్
- 210 ఎకరాల సీలింగ్ భూములు స్వాధీనంలోనూ అదే నిర్లక్ష్యం
- బడాబాబులకు కొమ్ముకాస్తున్నారంటూ విమర్శలు
- పోలీసుల ద్వారా బాధితులను అణగదొక్కే యత్నం
- సమస్యను వెంటనే తేల్చాలంటున్న బాధిత దళితులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దెందులూరు మండలం దోసపాడులో దళితుల భూసమస్య అధికారులు ఎప్పటికి తేలుస్తారో అర్థం కాకుండాపోయింది. 2006 నుంచి దోసపాడు భూముల్లో బాధిత దళితులు పోరాడుతున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దశాబ్దాల కిందట ప్రభుత్వం పేదలకిచ్చిన అసైన్డ్, సీలింగ్ భూములను కొంతమంది బడాబాబులు అక్రమంగా సొంతం చేసుకుని అనుభవిస్తున్నారు. ఇప్పటికీ ఆ భూములు ప్రభుత్వం పంపిణీ చేసిన పేదల పేరుపైనే రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. మొత్తం 106 ఎకరాల అసైన్డ్ భూముల వ్యవహారంలో 48 బాధిత కుటుంబాలకు సంబంధించిన 72 ఎకరాల సమస్య జాయింట్ కలెక్టర్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఏళ్లు గడుస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇక 210 ఎకరాల సీలింగ్ భూములకు సంబంధించిన సమస్యను రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని పంపిణీ చేయాల్సి ఉన్నా ఉలుకుపలుకు లేకుండాపోయింది. తమ భూములు తమకే ఇప్పించాలంటూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయడంతోపాటు పాదయాత్రలు, భూముల్లోకి వెళ్లడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. పోలీసులను రంగంలోకి దింపి బాధితులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారే తప్ప భూసమస్యను మాత్రం పరిష్కరించడం లేదు. భూములు పేదల పేరిట ఉన్నట్లు రికార్డులు స్పష్టంగా చూపిస్తున్నా నాన్చుడి ధోరణి ఎందుకు అవలంభిస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. దోసపాడు భూసమస్యకు సంబంధించి దాదాపు 125 బాధిత కుటుంబాలు ఉన్నాయి. వీరంతా తమకు న్యాయం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. భూములకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ అధికారులు బాధితులతో మాట్లాడి పరిష్కరించాలి. అయితే దెందులూరు మండలంలోని రెవెన్యూ అధికారులు మాత్రం భూముల వద్దకు వెళ్లకుండా పోలీసులను పంపుతున్న పరిస్థితి ఉంది. దెందులూరు మండల రెవెన్యూ అధికారులతో సమస్య పరిష్కరించకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూములను సొంతం చేసుకున్న విజయవాడకు చెందిన దేవినేని బాజీప్రసాద్‌కు స్థానిక రెవెన్యూ అధికారులు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకునే అధికారులు, ఆ ప్రజలకు అండగా ఉండకుండా బడాబాబులకు అండగా ఉండటంపై సర్వత్రా చర్చ సాగుతోంది. దోసపాడు భూసమస్య పరిష్కారంలో అధికారులు కావాలనే నాన్చుడి ధోరణి ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం బాధితుల్లో వ్యక్తం అవుతోంది. చట్టప్రకారం వ్యవహరించాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లా ఉన్నతాధికారులను సైతం మండలంలోని రెవెన్యూ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారనే అభిప్రాయం బాధితుల్లో నెలకొంది. అధికారులు వెంటనే దోసపాడు దళితుల భూసమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

నేడు, రేపు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల 30, 31 తేదీల్లో తణుకులో గీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆహ్వాన కమిటీ అధ్యక్షులు కామన మునిస్వామి తెలిపారు. 30వ తేదీన రాష్ట్ర మహాసభలకు 20 జిల్లాల నుంచి సుమారు 400 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. అదే రోజు గీత కార్మికులు మోకులు కట్టుకొని మున్సిపల్ కార్యాలయం నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా సమావేశం జరగనున్న లయన్స్ క్లబ్ ఆడిటోరియం వరకూ ప్రదర్శన నిర్వహిస్తారని తెలిపారు. ప్రదర్శన అనంతరం 80 వసంతాల సభ జరుగుతుందని తెలిపారు. 31వ తేదీ రెండో రోజు వివిధ 20 జిల్లాల నుంచి వచ్చిన సొసైటీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో మహాసభ నిర్వహిస్తామని, ఈ సభకు ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని గీత కార్మికులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో నరేంద్ర సెంటర్ వద్ద తాటిచెట్టు ఏర్పాటు చేశారు.



మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన తాటిచెట్టు, ఫ్లెక్సీ

సంతృప్తి చెందేలా అర్జీలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలు సంతృప్తి చెందేలా స్పందన అర్జీల పరిష్కారం ఉండాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను కలెక్టరు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఫిర్యాదు దారుల అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీదారులు సమస్యలు పరిష్కారం కాలేదని తరచూ కార్యాలయం చుట్టూ తిరగకుండా, ఒకసారి వచ్చిన ఫిర్యాదు రెండోసారి రాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని కలెక్టరు తెలిపారు. ఈ రోజు నిర్వహించిన స్పందనలో 226 ఫిర్యాదులు అందాయి. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి. రెండు కొబ్బరి చెట్లు తమ ఇంటిపైకి ఒరిగిపోయాయని, మట్టలు పడిపోతున్నాయని, వాటిని తొలగించాలని ఆచంట మండలం కోడేరు గ్రామానికి చెందిన బల్లా జోగి సత్యనారాయణ ఫిర్యాదులో కోరాడు. ఇంటి స్థలం కోసం దరఖాస్తు పెట్టుకున్నానని, 90 రోజుల్లో మంజూరు చేస్తామని లెటరు కూడా ఇచ్చారు. గడువు పూర్తయినా ఇంకా స్థలం రాలేదని మంజూరు చేయాలని మొగల్తూరు మండలం ముత్యాలపల్లికి చెందిన తిరుమాని రాంబాబు కోరాడు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, డిప్యూటీ ట్రెయినీ కలెక్టరు సంగీత్ మాధుర్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

చంద్రబాబు జీవితం అబద్ధాలమయం : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకురూరల్

చంద్రబాబు నాయుడు ఎప్పుడూ జీవితంలో నిజం చెప్పడని, పచ్చి అబద్ధాలు మాట్లాడే వ్యక్తి అని పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తణుకు మండలం మండపాక గ్రామంలో మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు జీవితం అబద్ధాలమయం అన్నారు. ఇవాళ రాష్ట్రం అంతటా తిరుగుతున్నాడని, చంద్రబాబు సమావేశాల్లో జనాలే కరువయ్యారని తెలిపారు. చంద్రబాబు ప్రజల సొమ్ము ఎంతో తినేశాడన్నారు. ఆయన మనుషులంతా పచ్చి అబద్ధాలు చెప్పేవారే అని విమర్శించారు. వేల్పూరులో 2017లో 30 పడకల ఆసుపత్రి మంజూరైందని, 2019లో ఎన్నికలకు వారం రోజుల ముందు బడ్జెట్ కేటాయించి అప్పటికప్పుడు శంకుస్థాపన చేసి మట్టి తవ్వి వదిలేశారని తెలిపారు. ఆ శిలాఫకాన్ని కూడా మట్టి తవ్వేటప్పుడు తీసి పక్కన పెట్టారన్నారు. ఆ శిలాఫలకాన్ని కూడా మేమే తీసేశామని ఆరోపణలు చేయడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. అలాంటి బురదజల్లే మనిషి ఎక్కడా చూడలేదని తెలిపారు. రాధాకృష్ణ పదహారున్నర ఎకరాల లేఅవుట్ వేశామని, రూ.60 లక్షలు పోయేలాగ ఉంది తనకు ఈ పనిచేసి పెట్టమంటే వెంటనే చేశామన్నారు. అయితే అతను దుర్మార్గుడు, నయవంచకుడని తెలిపారు. వేల్పూరు మనిషిగా వేల్పూరుకు ద్రోహం చేసింది మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి అన్నారు. వేల్పూరు గ్రామంలో బిసి కమ్యూనిటీ హాలు నిర్మిస్తే మీసం తీయించుకుంటా అన్నావు, రాధాకృష్ణ ఇప్పుడు బిసి కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నాం మీసం తీయించుకో అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, గుబ్బల తమ్మయ్య, మాజీ ఎఎంసి ఛైర్మన్ చిట్టూరి సుబ్బారావు, మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు పాల్గొన్నారు.

జనసేన, టిడిపి పొత్తు.. వైసిపి చిత్తు : పితాని

ఆచంట: జనసేన, టిడిపి పొత్తుతో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని టిడిపి, జనసేన సమన్వయకర్త, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. అయోధ్యలంక గ్రామంలో సోమవారం పితాని పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనతో ఐదేళ్లగా ప్రజలంతా విసిగిపోయారన్నారు. అధికార మార్పును కోరుకుంటున్నారన్నారు. వైసిపిని గద్దెదించే విధంగా జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పెదమల్లం పంచాయతీ పరిధి ఆనగార్లంక, పెదమల్లంలంక గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపి నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య పాల్గొన్నారు.

'పది'లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, మండల, డివిజన్ స్థాయి విద్యాశాఖ అధికారులతో పదో తరగతి పరీక్షా ఫలితాలు, నాడు-నేడు పనులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రశాంతి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పదో తరగతి మొదటి మెట్టు అన్నారు. ఎక్కడికి వెళ్లినా ముందు అడిగేది పదో తరగతి మార్కులు అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి 50 శాతం పైగా నిధులు కేటాయించి, ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఎంతో కష్టపడి మీరు పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ తయారు చేశారని, దాన్ని జిల్లా పరిషత్తు నిధుల ద్వారా విజయకేతనం పుస్తకాన్ని తయారు చేసి విద్యార్థులందరికీ అందించామన్నారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సమాజంలో ఆదరణ తక్కువని, వారు పాసయ్యేలా చదివించి ఆ గుర్తింపు మీ ద్వారా వారికి తేవాలన్నారు. విద్యార్థులను నిరుత్సాహ పర్చొద్దని, వారికి మంచి మాటలతో ప్రోత్సాహం అందించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రతి సబ్జెక్టుకూ ప్రాధాన్యతివ్వాలన్నారు. మంచి మెళవలు చెప్పి బాగా చదివించినట్లయితే వారు మంచి గ్రేడులు సాధిస్తారని తెలిపారు. మనబడి నాడు-నేడు పనులకు సంబంధించి నిధులుంటే మిగతా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఆర్.వెంకటరమణ, విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎన్.సత్యనారాయణ, ఉప విద్యాశాఖా అధికారులు ఎన్.రవీంద్రభారతి, డి.శ్రీరామ్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఎన్‌వి.రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

నేటి నుంచి భీమవరంలో దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం


ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ మంగళవారం నుంచి దీక్షలు చేపట్టనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఐ జిల్లా సమితి కార్యాదర్శి కోనాల భీమారావు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, ఎంసిపిఐ(యు) చంటి తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, నిధులు, రాజధాని నిర్మాణానికి, వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాలకు ప్యాకేజీలు, నిధులు, రైల్వేజోన్ ఇవ్వకుండా మొండిచేయి చూపిస్తున్న బిజెపి విధానాలు అత్యంత దారుణమని విమర్శించారు. అమర వీరుల దినోత్సవాన్ని పురుస్కరించుకొని ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో ఈ దీక్షలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి అన్యాయం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నోరు మెదపడంలేదని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే విధంగా వాపమక్షాలతోపాటు ప్రజాతంత్రవాదులు, విద్యార్థి, యువజన, మహిళా, కలిసి వచ్చే ప్రజా సంఘాలను కలుపుకొని దశలవారీగా దీక్ష చేస్తున్నట్లు తెలిపారు.

కులగణనపై మరోసారి సమావేశం నిర్వహించాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

కులగణనపై జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన అన్ని కుల సంఘాలతో మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. కేవలం కుల నమోదు మాత్రమే కాకుండా సామాజిక, ఆర్థిక పరిస్థితులపై కూడా లెక్కించాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి కెసిహెచ్.అప్పారావుకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో కులగణన సర్వేపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ క్రాంతిబాబు మాట్లాడుతూ జిల్లాలో కులగణన సర్వే తేదీ పొడిగించాలన్నారు. కేవలం ఫోన్లో ఓటిపిల ద్వారా కాకుండా ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, మండల నోడల్ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో సర్వేలో పాల్గొనాలని కోరారు. జిల్లాలో కులగణన సర్వే వేగవంతం చేయడం అభినందనీయమన్నారు. ఈ సర్వే మరింత కూలంకుషంగా జరగాలంటే మరో వారం రోజులు సమయం పొడిగించాలని సూచించారు. జిల్లాలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ అయిన ఆధార్ నంబరు, ఫోన్ నంబరు ఓటిపి ద్వారా ఈ సర్వే చేస్తున్నారని తెలిపారు. జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్ మాట్లాడుతూ సర్వే సమయంలో సర్వర్ ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో రాత్రి వేళల్లో కూడా వాలంటీర్లు సర్వే చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలో జరిగే సర్వేలో కెవిపిఎస్ సంఘంగా కొన్నిచోట్ల పాల్గొంటున్నామని చెప్పారు. సర్వే పూర్తయ్యే వరకూ దళితపేటలో అవసరమైన సహాయ సహకారాలు సంఘం తరపున అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



జిల్లా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కెవిపిఎస్ నేతలు

కొనసాగిన న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

భూ హక్కు యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నరసాపురంలో న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం బార్ అసోసియేషన్ నాయకులు ఆర్‌జి.కుమార్, మోచర్ల సత్యకృష్ణ, పోలిశెట్టి నారాయణ స్వామి (బాబ్జీ), చేగొండి బాలాజీ, కురెళ్ల సోమశేఖర్, ఉల్లంపర్తి సత్యనారాయణ, చెన్నూరి వెంకటేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం వల్ల ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడైనా భూ వివాదాలు ఏర్పడినప్పుడు సివిల్ కోర్టుల ద్వారా వాటిని ప్రజలు పరిష్కరించుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే భూ రికార్డుల మ్యూటేషన్లు రెవెన్యూ అధికారుల ఆధీనంలో ఉన్నాయని, ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం ప్రత్యేకంగా ఓ విభాగం కూడా ఉందని వారు వివరించారు. అయితే వాటి అన్నింటినీ కాదని కొత్త చట్టంలో పూర్తి అధికారాలను రెవెన్యూ అధికారులకు సంక్రమింపజేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కొత్త చట్టంలో న్యాయ వ్యవస్థకు ఉన్న అధికారాలను తొలగించి పూర్తిగా రెవెన్యూ అధికారులే ఆస్తి హక్కును నిర్ధారించడం, వివాదాలు పరిష్కరించడం, సహజ న్యాయ సూత్రాల ప్రాతిపదికగా ఆస్తి హక్కును నిర్ధారిస్తామని చట్టంలో పేర్కొనడం ఆక్షేపణీయమన్నారు. ఈ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పోలిశెట్టి శ్రీరఘు రామారావు, పుప్పాల వెంకట కృష్ణారావు, కామన బాల సత్యనారాయణ, దొంగ నరసింహరాజు, ఆనంద చక్రవర్తి పాల్గొన్నారు.

పాలకొల్లు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రజల ఆస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని, వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేయాలని పాలకొల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తలుపుల శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని కోర్టు సమీపంలో బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం నుంచి నిరవధిక దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, దశిక శేషగిరిరావు, జివి.సుబ్బారావు వంటి సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు. కేవలం ప్రజలకు నష్టం కలిగించే ఈ చట్టాన్ని రద్దు చేయాలని ఉద్యమిస్తున్నామన్నారు. న్యాయవాదులు లక్ష్మి, లక్ష్మీ బిందు, దుర్గ, సత్య, కిషోర్, నగేష్ పాల్గొన్నారు.



నరసాపురం: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ధన్యజీవి సూర్యప్రకాశరావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రతి మనిషికీ జననం, మరణం సహజమని, అయితే మనిషి బతికున్నంత కాలం ఈ సమాజం కోసం ఏం చేశారనే దానిబట్టి ఆ మనిషి గొప్పతనం తెలుస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. సోమవారం స్థానిక పడమర వీధిలోని సిపిఎం పూర్వపు పట్టణ కార్యదర్శి పల్నాటి సూర్యప్రకాశరావు సంస్మరణ సభ పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. సభలో ముఖ్యవక్త సీతారాం మాట్లాడుతూ సమాజంలో మనిషి పుట్టుక, చావు సహజమేనని, పుట్టిన ప్రతి మనిషీ గొప్పవాడు కాలేడని అన్నారు. ఈ సమాజంలో మనుషుల మధ్య కుల, మత, ఆర్థిక, లింగ బేధ అంతరాలు పోగొట్టి సమ సమాజ స్థాపనే ధ్యేయంగా సిపిఎం పని చేస్తోందన్నారు. అటువంటి సిపిఎం జెండాను చేతబట్టి, తుది శ్వాస విడిచే వరకూ పని చేసిన సూర్యప్రకాశరావు ధన్యజీవి అని కొనియాడారు. సూర్యప్రకాశరావు సాధారణ రైస్ మిల్లు కార్మికునిగా జీవితం ప్రారంభించారని, తాను పని చేస్తున్న కార్మికుల హక్కులు కాపాడటం కోసం సిఐటియు తరపున రైస్‌మిల్లు కార్మికుల సంఘాన్ని ఏలూరు తాలూకాలో స్థాపించారని గుర్తు చేశారు. కార్మికుల హక్కుల కోసం యజమానులతో వేతన ఒప్పందాలు చేసే సమయంలో ఒక్క పైసా దగ్గర కూడా రాజీ పడేవారు కాదని తెలిపారు. నిరాడంబర జీవితం, నిజాయతీలను ప్రకాశరావు నుండి నేటి యువతరం నేర్చుకోవాలన్నారు. పార్టీ కార్యకర్తల పట్ల ఆయన చూపించే గౌరవం నేటి నాయకత్వం నేర్చుకోవాలని సూచించారు. సీనియర్ నాయకులు బి.సోమయ్య మాట్లాడుతూ రైస్‌మిల్ కార్మికుల హక్కుల కోసం ఏలూరులో ఉద్యమం జరుగుతున్నప్పుడు యజమానులు కొందరు కిరాయి గుండాలను పెట్టి ప్రకాశరావుపై హత్యాయత్నానికి పాల్పడితే ఆయన ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డారని గుర్తు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సూర్యప్రకాశరావు ఏలూరు పట్టణంలో కార్మిక ఉద్యమ నేతగా, హమాలీ కార్మికుల హక్కుల కోసం పని చేశారన్నారు. ఆయన అటు కుటుంబాన్ని, పిల్లలను తీర్చిదిద్దుకోవడంతోపాటు పట్టణంలో కార్మికోద్యమాన్ని నిర్మించారని కొనియాడారు. పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సీనియర్ నాయకుల్లో ప్రకాశరావు ఒకరన్నారు. ప్రతి సమావేశంలో ముక్కుసూటితత్వంతో మాట్లాడే వారని తెలిపారు. తన తదిశ్వాస వరకు ఎవరిపైనా ఆధారపడకుండా తన పనులు తానే చేసుకునే వారని గుర్తు చేశారు. సిపిఎం సీనియర్ నేత చింతకాయల బాబూరావు మాట్లాడుతూ సూర్యప్రకాశరావు హమాలీలు, రైస్‌మిల్లు కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం తన యావత్ జీవితాన్ని ధారబోశారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ తమ తరానికి సూర్యప్రకాశరావు లాంటి నేతలు ఆదర్శమని కొనియాడారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ మనిషి చనిపోతే ఆ కుటుంబాల్లో ఒకటి, రెండు సంవత్సరాలు మాత్రమే గుర్తుపెట్టుకుంటారని, కమ్యూనిస్టు పార్టీల్లో జీవితాంతం ఆ కార్యకర్త చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూనే ఉంటారని అన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పల్నాటి సూర్యప్రకాశరావు సిపిఎం నేత అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీల నాయకులందరికీ ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. ఈ సభలో సిపిఎం సీనియర్ నాయకులు కంది విశ్వనాథం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు, సిపిఎం పడమర వీధి శాఖ కార్యదర్శి వైఎస్.కనకారావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, ఆర్.లింగరాజు, జి.రాజు, నాయకులు కె.శ్రీనివాస్, పివి.రామకష్ణ, తెల్లం దుర్గారావు, ఎ.ఫ్రాన్సిస్, జి. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

బాలికలపై హెచ్‌ఎం లైంగిక వేధింపులు

శిక్షించాలని తల్లిదండ్రుల నిరసన

పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి - తణుకు రూరల్

అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినుల పట్ల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరెడ్డి అసభ్యకరంగా ప్రవర్తించారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాల వంట గదిలోకి చిన్నారులను తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు చిన్నారులు తెలిపారు. సెల్‌ఫోన్‌లో వీడియోలను చూపించి చిన్నారులను ప్రలోభపెడుతున్నట్లు తెలిపారు. చిన్నారులను బెదిరించి, వైద్యతో కొడుతూ చేస్తున్న ఆకృత్యాలను ఒక చిన్నారి ఇంట్లో తల్లిదండ్రులకు తెలియజేయడంతో విషయం బయటకు వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలలో నెపంను చిన్నారుల తల్లిదండ్రులు నిర్బంధించి కఠినంగా శిక్షించాలంటూ పాఠశాల బయట నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రధానోపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు. మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు తణుకు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని వైద్య పరీక్షలకు తీసుకొచ్చిన విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం డివిజన్ డిఎస్‌పి శరత్‌రాజ్‌కుమార్ తెలిపారు. చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందరూ క్షేమంగా ఉన్నారని తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ వి.అరుణ తెలిపారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

అత్తిలి :చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న హెచ్‌ఎంను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కారుమంచి క్రాంతిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌ఎం చిన్నపిల్లలను లైంగిక వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు. డిఇఓ, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు తక్షణం పర్యటించి సమగ్ర విచారణ చేపట్టాలని వారు కోరారు.

'పిఎంఎంఎస్‌వై'ను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన పిఎంఎంఎస్‌వై పథకంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రూ.7.23 కోట్ల విలువైన 37 యూనిట్లకు సంబంధించి రూ.3.05 కోట్ల రాయితీతో అందించడానికి ఆమోదించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనరల్ కేటగిరీలో లబ్ధిదారులకు 40 శాతం రాయితీ, ఎస్‌సి, ఎస్‌టి, మహిళా లబ్ధిదారులకు 60 శాతం రాయితీపై యూనిట్స్ అందించనున్నట్లు చెప్పారు.

మంత్రి కొట్టును కలిసిన నారాయణమూర్తి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి తన స్వగ్రామంలోని రెండు ఆలయాలకు ధూప దీప నైవేద్యం స్కీం అమలు చేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మల్లంపేట గ్రామంలోని శ్రీరామాలయం, వినాయకుడి ఆలయాలకు ధూప దీప నైవేద్య స్కీమ్ మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పరిశీలించి మంజూరు చేస్తామని ఈ సందర్భంగా మంత్రి కొట్టు హామీ ఇచ్చారు.

డాక్టరేట్ గ్రహీత ప్రసాద్‌కు అభినందన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రముఖ సంగీత విద్వాంసులు, దేశ విదేశాల్లో వెలిది భజనలు, సంగీత కచేరీలు నిర్వహించిన పిప్పళ్ల ప్రసాద్‌కు యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా ప్రభుత్వ విప్, భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ సోమవారం అభినందించారు. 30 ఏళ్లుగా ఆధ్యాత్మిక భజనలు, సంకీర్తనలతో ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం కల్పిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్న నేడు ఒక ప్రసిద్ధ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకోవడం ఈ ప్రాంతానికి గర్వకారణమని అభినందించారు. డాక్టరేట్ అందుకున్న ప్రసాద్ మాట్లాడుతూ ఒక సాధారణ కళాకారుడిని భగవంతుని ఆశీస్సులతో అందరి మన్ననలతో ముందుకు సాగుతున్నానన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పిప్పళ్ల ప్రసాద్ డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమన్నారు.

మురళీకృష్ణకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న పాలకొల్లు విజయ ల్యాబ్ అధినేత, వార్ఫ్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు కొమ్ముల మురళీకృష్ణను వార్ఫ్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్త కుళాయి చెరువు వద్ద సోమవారం ఘనంగా సత్కరించారు. పఠిక క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ అధ్యక్షత వహించగా సభ్యులు లయన్స్ క్లబ్, వార్ఫ్ క్లబ్, ఇతర సేవాసంస్థల ద్వారా మురళి సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు.

'గ్రామాలాభివృద్ధి పట్టని వైసిపి'

ప్రజాశక్తి - ఉండి

గ్రామ పంచాయతీ నిధులను సంక్షేమ పథకాలకు మళ్లించి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని చెరుకువాడలో పార్టీ గ్రామ అధ్యక్షులు ఇరిండి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామపంచాయతీలకు నిధులు అందించి గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

నేరాలు - ఘోరాలు

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రైలులో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం జిఆర్‌పి ఎస్‌ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో రైల్వే ఎస్‌ఐ శ్రీహరిబాబు తన సిబ్బందితో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్లాట్‌ఫారం-2లో సాయినగర్ శిరిడి ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీ, ఘంటసాలవీధికి చెందిన బద్దిరెడ్డి సూరిబాబు వద్ద తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. రూ.28,560 విలువైన 36 మద్యం ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని సూరిబాబును అరెస్టు చేశారు.

పోలీస్ స్టేషన్ వద్ద మృతదేహంతో ఆందోళన

రైతు, కౌలుదారు అనుచరుల మధ్య ఘర్షణ

పరస్పర కేసులు నమోదు

మూడు రోజుల తర్వాత కౌలు రైతు కుమారుడు మృతి

హత్య కేసుగా నమోదు చేయాలని మృతుని బంధువుల ఆందోళన

పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా నమోదు చేస్తామని చెప్పిన పోలీసులు



పీటర్ (ఫైల్)

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని చినకాపవరం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పెద్దిరెడ్డి శ్రీనివాసరావు కుమారుడు పెద్దిరెడ్డి జాన్ పీటర్ (నన్ని)(25) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పీడర్ మృతదేహంతో కుటుంబసభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆకివీడు పోలీస్ స్టేషన్‌కు చేరారు. జాన్ మృతిని హత్యగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చినకాపవరం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి శ్రీనివాసరావు ప్రస్తుతం భీమవరంలో కాపురం ఉంటున్న అనంతపల్లి వెంకటరత్నం కుటుంబీకులకు చెందిన పంట భూమిని సుమారు మూడు దశాబ్దాలుగా కౌలుకు సాగు చేస్తున్నారు. అయితే ఆ భూమిని యజమాని వెంకటరత్నం కుటుంబీకులు అమ్మకానికి పెట్టారు. భూమి తానే కొనుక్కుంటానంటూ శ్రీనివాసరావు యజమాని దగ్గరికి వెళ్లాడు. తనకు తగిన ధర రానందున శ్రీనివాసరావుకు



స్టేషన్ వద్ద ఎంఎల్‌ఎ రామరాజు, జనసేన నేతలు

అమ్మడానికి యజమాని నిరాకరించారు. ఈ స్థితిలో భూమి ఖాళీ చేయడానికి శ్రీనివాసరావు నిరాకరించాడు. భూ యజమాని వెంకటరత్నం మనుషులు చేలు ఊడుస్తామంటూ ఈ నెల 26వ తేదీ చేలోకి దిగారు. అదే సమయానికి శ్రీనివాసరావు మనుషులు కూడా చేలోకి దిగారు. ఈ క్రమంలో ఇరు గ్రూపుల వారు ఘర్షణ పడ్డారు. ఇరు గ్రూపుల వారు రెండు రోజుల తర్వాత ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరు గ్రూపులవారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం భూమి కౌలుదారు శ్రీనివాసరావు కుమారుడు జాన్ పీటర్ ఆకస్మికంగా మరణించాడు. శుక్రవారం జరిగిన ఘర్షణలో తగిలిన గాయాల వల్ల తన కుమారుడు మరణించాడని జాన్ పీటర్ తండ్రి శ్రీనివాసరావు ఆరోపించారు. ఆ మేరకు కేసు నమోదు చేయాలంటూ ఆకివీడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయడం తాత్సార్యం చేస్తున్నారంటూ మృతదేహంతో ఆకివీడు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, జనసేన నాయకులు జుత్తిగ నాగరాజు, టిడిపి నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు(రత్నం) పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కేసు నమోదు చేయాలంటూ పోలీసులతో మాట్లాడారు. ఇదే అంశంపై ఇప్పటికే కేసు నమోదు చేసి ఉన్నందున పోస్టుమార్టం అనంతరం మిగిలిన కేసులు ఉంటాయని పోలీసులు చెప్పారు. అందుకు జనసేన, టిడిపి నాయకులు అంగీకరించలేదు. ఉన్నతాధికారులకు సమాచారం అందించామని, న్యాయ సూచన, సలహాల మేరకు, అధికారుల ఆదేశాలతో వ్యవహరిస్తామని ఎస్‌ఐ నాగబాబు చెప్పారు. టిడిపి, జనసేన నాయకులు ఆ దిశగా తామే ప్రశ్నిస్తామంటూ భీమవరం జిల్లా ఎస్‌పి వద్దకు వెళ్లారు. సమస్యలకు దారి తీయకుండా ముందస్తుగా పోలీసులు సుమారు 30 మంది ఎఆర్ సిబ్బందిని, మరో 20 మంది సివిల్ సిబ్బందిని దింపారు. భీమవరం రూరల్ సిఐ సత్యకిషోర్ మరో ముగ్గురు ఎస్‌ఐలు ఆకివీడు స్టేషన్‌కు తరలివచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జెజెఎం పనులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జల జీవన్ మిషన్ పథకంలో జరుగుతున్న పనులు వేగవంతం చేసేందుకు అధికారులు శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న జెజెఎం పనుల ప్రగతిపై కలెక్టరేట్‌లో ఆమె అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రూ.407 కోట్ల అంచనా వ్యయంతో 1,474 పనులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే 557 పనులు పూర్తికాగా, 1,136 పనులు చేపట్టేందుకు టెండర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 338 పనులను కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ సిస్టం ద్వారా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు ఏర్పాట్లు

జెసి రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి -భీమవరం

ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి ఆటల పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై జాయింట్ కలెక్టర్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి ఆటలకు అనువైన మైదానం గుర్తించి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు వివిధ ఆటల పోటీల్లో పాల్గొంటారని, వారికి వసతి, భోజన సదుపాయాలు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడాకారులను ఆటల పోటీలకు తీసుకురావడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలన్నారు.

లారీ డ్రైవర్లకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - పాలకొల్లు

వివిధ హెవీ వాహనాల డ్రైవర్లు ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ తీసుకోవాలని పాలకొల్లు రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. పాలకొల్లు లారీ స్టాండ్ వద్ద వివిధ హెవీ వాహనాల డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాలకొల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పాలకొల్లు ఆయుర్వేద వైద్యులు సహాయంతో వైద్య పరీక్షలు కూడా నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొత్తం 199 మంది డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 48 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. పది మందికి కంటి చికిత్సలు త్వరలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. లారీ అసోసియేషన్ అధ్యక్షులు దుగ్గిన రాము, కార్యదర్శి యడ్ల సత్యనారాయణ సహకరించారు. లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ ముత్యాల సత్యనారాయణ, అధ్యక్షులు ఎన్.అరుణ, కార్యదర్శి ఎం.నారాయణరావు, కోశాధికారి దోనెల

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు గ్రామంలో స్వయంభూ శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో అన్నదాన భవన నిర్మాణానికి కొంతమంది దాతలు సోమవారం విరాళం అందించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన భూపతిరాజు సుబ్బరాజు, నాగమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు భూపతిరాజు నరసింహరాజు రూ.ఐదు వేలు, కాళ్లకూరు గ్రామానికి చెందిన పొత్తూరి వెంకటరాజు రూ.25 వేలు, భీమవరానికి చెందిన గోమగుంట్ల వెంకట నాగరామసుశాంత్ రూ.12,006 ఆలయ కార్యనిర్వహణ అధికారి మోకా అరుణ్‌కుమార్‌కు అందించారు.

'కులగణన చారిత్రాత్మకం'

ఉండి :కుల గణన చారిత్రాత్మకమైన నిర్ణయమని వైసిపి జిల్లా మాజీ అధికార ప్రతినిధి బడుగు బాలాజీ గౌడ్ అన్నారు. ఉండిలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో బిసిల పక్షపాతి సిఎం జగన్ కులగణన చేస్తుంటే బిసిల జనాభా తేటతెల్లం అవ్వడం ఓర్వలేని జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. విస్సాకోడేరు సర్పంచి బొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ కులగణన బిసిలకు అత్యంత ఉపయోగమన్నారు. మాజీ సర్పంచి చెల్లుబోయిన పాపారావు పాల్గొన్నారు.

'జగన్ పాలనలో రాష్ట్రం అంధకారం'

పాలకొల్లు :వైసిపి ప్రభుత్వం హయాంలో ప్రజల మనుగడ అంధకారంగా మారిందని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి దురాగతాలకు, అసమర్థత, విధ్వంసకర పాలనకు ప్రజా కోర్టులో శిక్ష పడే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, ప్రజలందరూ జగన్ పాలనపై విసుగెత్తి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో జగన్ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేకపోయారన్నారు. జరగబోయే కురుక్షేత్ర ధర్మ యుద్ధంలో టిడిపి, జనసేన కూటమి గెలుపు ఖాయమన్నారు.


ఆచంటలో దోమల నివారణకు చర్యలు

గ్రామస్తుల రక్త నమూనాలు సేకరణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఆచంట

మండల కేంద్రమైన ఆచంటలో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. పారిశుధ్య పనులు చేయించారు. ఇటీవల ఆచంటలో డెంగీతో యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైన ఆచంటలో అపారిశుధ్యం కథనానికి ఆచంట పంచాయతీ కార్యదర్శి నరసింహరావు, డిఎల్‌పిఒ ఎం.నాగలత, ఇఒపిఆర్‌డి మూర్తిబాబు స్పందించారు. పారిశుధ్య పనుల్లో భాగంగా ఎబెట్ మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ నాగలత మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం సమయంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, ఉదయం ఎబెట్ మందును పిచికారీ చేయించాలని అధికారులకు సూచించారు. ఎఎన్‌ఎంను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండోరోజు సోమవారం



ఎఎన్‌ఎంను వివరాలు అడుగుతున్న డిఎల్‌పిఒ

ఆచంటలో వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సత్యవతి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు బృందాలుగా ఇంటింటా సర్వే నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ అపరిశుభ్రతకు తావు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. అనంతరం దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే సర్టిఫికెట్ జారీ

ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌ఐఒ చంద్రశేఖర్‌బాబు

ప్రజాశక్తి - భీమవరం


త్వరలో నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి నైతికత, మానవ విలువలు, పర్యావరణ విద్య, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై జిల్లాలోని వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని స్థానిక గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రాంతీయ ఇన్స్పెక్షన్ అధికారి (ఆర్‌ఐఒ) కె.చంద్రశేఖర్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఒ చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 2న నైతికత, మానవ విలువలు పరీక్ష, 3న పర్యావరణ విద్య పరీక్షలు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ రెండు పరీక్షలు ఉత్తీర్ణులయితేనే ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. గతంలో ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులు ఇప్పుడు హాజరు కావొచ్చని తెలిపారు. విద్యార్థి ఏ కళాశాలలో విద్యను చదువుతున్నారో అదే కళాశాలలో ఈ పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. ఇంట ర్మీడియట్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులం దరూ తప్పనిసరిగా ఈ రెండు పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధిం చాలన్నారు. మొదటి సంవత్సరం చదివే ప్రతి విద్యార్థికి, వారి తల్లిదం డ్రులకు కళాశాల యాజమాన్యాలు ఈ పరీక్షల విషయంలో అవగాహన కల్పించి పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. జిల్లా ఇంటర్మీడి యట్ ఎడ్యుకే షన్ అధికారి కెవి.సత్యనారాయణ, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు ఎం.నరసింహమూర్తి, ఎ.రాజ్‌కృష్ణ పాల్గొన్నారు.

ప్రతిభావంతులను వెలికి తీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

బహుమతుల ప్రదానంలో పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడమే ఆడుదాం ఆంధ్రా ముఖ్య ఉద్దేశమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి ఆటల పోటీల ముగింపు ఉత్సవాల్లో పివిఎల్ పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లాస్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి విజేతలుగా నిలిస్తే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నగదు బహుమతికి రెండింతలు తాను అందించి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నానని పివిఎల్ చెప్పారు. అనంతరం ఉండి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ తదితర పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లకు రూ.35 వేల



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న పివిఎల్.నరసింహరాజు

చెక్కును, జ్ఞాపికను, ప్రశంసా పత్రాలను, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు రూ.15 వేల చెక్కును, జ్ఞాపికను ప్రశంస పత్రాలను, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.ఐదు వేల చెక్కును, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఆకివీడు ఎంపిపి కఠారి జయలక్ష్మి కేశవరావు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, పాలకోడేరు వైస్ ఎంపిపి ఆదాల లక్ష్మీతులసి, ఆకివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు గిరడా రమణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టిడ్కో గృహాల పట్టాలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజలకు మేలు చేయడమే సిఎం జగన్ లక్ష్యమని, భీమవరం పట్టణంలో నిర్మించిన టిడ్కో గృహాలు ప్రతి ఒక్క లబ్ధిదారునికి అందిస్తామని వైసిపి పట్టణ అధ్యక్షులు తోట బోగయ్య, మాజీ కౌన్సిలర్లు కోడే యుగంధర్, నందమూరి ఆంజనేయులు అన్నారు. స్థానిక 5, 19, 23, 25వ వార్డులో సుమారు 225 మంది లబ్ధిదారులకు రెండో విడత టిడ్కో గృహాల పట్టాలను సోమవారం అందించారు.

సుందరవనంగా శ్మశానవాటికలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో శ్మశానవాటికలను అత్యంత సుందరవనంగా తీర్చిదిద్దుతానని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని ఆగర్తిపాలెం గ్రామ హిందూ శ్మశానవాటికలో ఎంపీ నిధులు రూ.ఐదు లక్షలతో నిర్మించనున్న దహన సంస్కార షెడ్డుకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు పట్టణంలో హిందూ శ్మశానవాటికను అత్యంత సుందరంగా, ఆహ్లాదకరంగా, కైలాసవనంగా నిర్మించామని, అదే తరహాలో పట్టణంలో ఉన్న క్రిస్టియన్ శ్మశాన వాటికలను, గ్రామాల్లోని హిందూ, క్రిస్టియన్స్ శ్మశానవాటికులను నిర్మించాలన్నదే తన ఆశయమని చెప్పారు.

బాలునికి కొవ్వలి ఫౌండేషన్ సాయం

నరసాపురం :అనారోగ్యంతో బాధపడుతున్న బాలుని వైద్య సేవలకు కొవ్వలి ఫౌండేషన్ రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించింది. టిడిపి పట్టణ కార్యదర్శి కొల్లు పెద్దిరాజు మనవడు తిరుమాని చోక్షిత్‌శ్రీవర్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెద్దిరాజు కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడును సంప్రదించి విషయం తెలియజేయగా ఆయన స్పందించి ముందుగా రూ.10 వేలు అందించారు. సోమవారం ఉదయం రూ.40 వేల చెక్కును బాలుని తల్లికి అందించారు.

'వైఎస్‌ఆర్ ఆసరా' సొమ్ము జమ

ఆచంట :డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా రుణ మాఫీ పూర్తిస్థాయిలో నాలుగు విడతల్లో వారి ఖాతాల్లోనే జమ చేసినట్లు ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో క్యాంపు కార్యాలయం సమీపంలో ఘనంగా ఆసరా సంబరాల మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలకు రూ.173 కోట్ల వరకూ వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు.

కృష్ణకాంత్‌వర్మకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

5జి అప్లికేషన్స్‌తో మరింత సమర్థవంతమైన సమాచారాన్ని అందించేందుకు నూతన యాంటీనా రూపకల్పన చేసిన భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణకాంత్‌వర్మకు కర్ణాటకలోని బెల్గావ్‌లో ఉన్న విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల మీటింగ్ హాలులో కృష్ణకాంత్‌వర్మను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకాంత్‌వర్మ మాట్లాడుతూ బెంగళూరులోని నాగార్జున కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ ఇసిఇ హెడ్ డాక్టర్ కెఎన్.నగేష్ పర్యవేక్షణలో తాను రూపొందించిన అంశంపై పరిశోధనకు యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసిందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీ అభివృద్ధికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ ఇన్‌ఛార్జి హెడ్ ప్రొఫెసర్ జివి.పద్మారావు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.10 వేలు వితరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని జివిఎన్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలకు విద్యావేత్త, మాంటిస్సోరి స్కూల్ అధినేత కెవి.కృష్ణవర్మ రూ.10 వేలు విరాళం అందించారు. పాఠశాలను చూడగానే ఆకట్టుకునే విధంగా అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు, తెల్లవారి గుండెల్లో నిద్రించిన, నేతలకే నేతైన నేతాజీ చిత్రం గీసేందుకు ఆర్టిస్ట్ రవిశంకర్‌కు కృష్ణవర్మ రూ.పది వేలు అందించారు. కృష్ణవర్మకు పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, పిఎంసి సభ్యులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

'విలేకరిపై దాడి హేయం'

ప్రజాశక్తి - నరసాపురం

ఈనాడు నరసాపురం రూరల్ విలేకరి సిహెచ్.వెంకటేశ్వరరావుపై వైసిపి నాయకుడు దాడి హేయమైన చర్య అని మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, తెలుగు యువత జిల్లా యువత అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో మహిళలకు, రైతులకు, దళితులకే కాకుండా విలేకర్లకు కూడా రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న దారుణాలను ప్రశ్నిస్తుంటే ఇటువంటి దురాగతాలకు పాల్పడటం సరికాదన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

సీసీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ అన్నారు. నరసాపురం పురపాలక సంఘం పరిధిలోని రెండో వార్డులో జనరల్ నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలను అనుసరించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు

'జగన్‌పై విమర్శలు తగవు'

ప్రజాశక్తి - ఆచంట

తెలుగుజాతిని నిండాముంచి నిట్టనిలువుగా చీల్చిన కాంగ్రెస్ పార్టీలో చేరి జనహృదయా నేత సిఎం జగన్‌పై విమర్శలు చేయడం షర్మిలకు దగదని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. ఆచంట పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలను ముక్కలుగా చీల్చి తెలుగు వారి ఆత్మగౌరవంతో ఆటలాడుకున్న కాంగ్రెస్‌తో ఎలా కలిశారన్నారు. .

ఆరోగ్య ఆంధ్రప్రదేశే జగన్ లక్ష్యం

భీమవరం రూరల్ : రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిడమే లక్ష్యంగా సిఎం జగన్ పని చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించిన ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం జగన్ ప్రజారోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.31/2022

To.
Between
బోళ్ల రాము ...వాది
మరియు
మట్టపర్తి మధుసూదన్‌రావు, S/o.అప్పారావు, వయస్సు 50 సం||లు, హిందు, పురుష, డో.నెం.5-11, O.C. కాలనీ, కప్పల గుంట గున్నంపల్లి గ్రామం, భీమడోలు, పశ్చిమ గోదావరి. ...ప్రతివాది

పై నెంబర్ దావాలో ప్రతివాది అయిన మీకు అనేకసార్లు బేటా కట్టినప్పటికీ తీసుకొనకుండ కాలయాపన చేయుచున్నందున పత్రికా ముఖముగా ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా బోళ్ల రాము గారు ఈ పై నెంబర్ దావాను దాఖలు చేయగా సమన్లు తీసుకొనని కారణంగా మీరు **1-02-2024**వ తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు స్వయముగా గాని ప్లీడర్ గారి ద్వారా గాని కోర్టు ముందు హాజరై పై దావాలో ఎటువంటి ఆక్షేపణలు ఉన్న తెలియపరచుకొనవలెను. అట్లు కానిచో మీకు పరోక్షముగా దావాలో తీర్పు రాబడునని తెలియజేయడమైనది.

ఎం.ఏసుపాదం, ఎం.బి.అవినాష్
తాడేపల్లిగూడెం న్యాయవాదులు, తాడేపల్లిగూడెం
తేది.29-01-2024 సెల్: 7396446127

IN THE COURT OF THE 1 ADDL. DISTRICT JUDGE AT RAJAMAHENDRAVARAM
E.P. 3/2023 IN OS 19/2018

Between :
1. Sri Sairam Estates, Vijayawada Rep by Maddi Naga Brahma Daneswara Rao (Died)
2. Maddi Venkata Gouri
3. Maddi Gnana Prasuna
4. Maddi Nagasai Manikantha
3 and 4 being minors Rep by their mother Maddi Venkata Gouri
5. Maddi Venkata Lakshmi

..... DHRs

BY
Padala Pavani, D/o Srinivasa Redy, D.No. 9-11-7/1, Near Ration Depo, Gandhi Reddygari Street, Savithripeta, Tadepalli gudem - 534102. ... JDR

పై నెంబరు ఇ.పి.లో జెడిఆర్‌కు CPC Or 21 Rule 34 Notice నిమిత్తం ది. 27-02-2024కు వాయిదా అయివున్నది. కావున పై నెంబరులోని జెడిఆర్‌కు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి యెదుట పై నెంబరు జెడిఆర్ స్వయంగా గానీ, అడ్వకేటుగారి ద్వారా గానీ హాజరై తెలుపుకొనవలయును. లేనియెడల సదరు జెడిఆర్ పరోక్షమందు శ్రీ కోర్టువారు డిహెచ్‌ఆర్‌లకు షెడ్యూలు ఆస్తికి విక్రయ దస్తావేజును వ్రాయించి ఇవ్వగలరని తెలియజేయడమైనది.

షెడ్యూలు : తూర్పుగోదావరిజిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్ డి|| రాధేయపాలెం రీ సర్వే నెం. 160/3 రు దాఖలా య. 1-25 1/2ట్లున్నూ, ఆర్.యస్.నెం. 149రు దాఖలా య.2-50ట్లు వెరశి య. 3-75 1/2 సెంట్లు సదరు భూమికి హద్దులు :
తూర్పు : సర్కారు పుంత
దక్షిణం : పడాల నాగిరెడ్డి గారి భూమి
పడమర : యీ భూమి
ఉత్తరం : సర్కారు పుంత, ఇందలి రెండవ ప్రతి
ఈ నాలుగు హద్దుల మధ్య య. 3-75 1/2ట్లు భూమిలో య. 0-72-4ట్లు పూర్వమే విక్రయము చేయగా మిగిలిన య. 3-02ట్లు భూమి.

ఇట్లు
రాజమండ్రి, బీరం సుబ్బారావు,
ది.29-1-2024 అడ్వకేట్ ఫర్ డిహెచ్‌ఆర్స్.